
# పందెం

వి.యం. అయోధ్యాచార్య



"**డా**మిట్! దిసీజ్ టూ మచ్" కోపంతో రెచ్చిపోయేడు మేనేజరు సదాశివరావు.

"టూ మచ్ కాదు సార్ ...! అంతకన్నా యింకా ఎక్కువే. ఆ సుబ్బారావు రోజు రోజుకీ ఆఫీసులో ఓ న్యూసెన్స్ సృష్టిస్తున్నాడు. అందుకు తోడు అందర్నీ వెర్రి వెంగళప్పల్ని చేసి మరీ జేబులు ఖాళీ చేస్తున్నాడు" అన్నాడు హెడ్ గుమాస్తా లోకనాథం సవినయంగా.

సదాశివరావు ఆవేశంతో ముక్కుపుటా లేగుం వేసాడు. కోపం వచ్చినప్పుడల్లా అట్లా చేయటం ఆయనకో అలవాటు. దరిమిలా ముక్కు మీదకు జారిన కళ్ళద్దాలనోమారు సరిజేసుకున్నాడు.

"ఈ సుబ్బారావు విషయం మొదట్లోనే నాకెందుకు చెప్పలేదూ ?" అని ప్రశ్నించాడు తన ఆవేశాన్ని కొంచెం కంట్రోల్ చేసుకునేందుకు ప్రయత్నిస్తూ.

లోకనాథం ఈ ప్రశ్నకి కొద్దిగా ఇబ్బంది పడిపోయి చంకలో ఉన్న ఫైళ్ళ నోమారు సర్దుకున్నాడు.

"చెప్పాలనే అనుకొన్నాన్సార్! కాని, మరీ ఇంత చిన్న విషయాన్ని మీ దాకా తీసుకురావటం సిల్లీగా వుంటుందేమోనని..." నసిగాడు చిన్నగా.

"ఐసీ!" సాలోచనగా తల పంకించాడు సదాశివరావు. ఓ క్షణం మవునంగా వుండిపోయాక తిరిగి అన్నాడు —

"అయితే మన ఆఫీసులో వున్న ఇంత మందిలో ఏ ఒక్కళ్ళకూ మతుల్లేకుండా పోయాయన్న మాట. ఆ సుబ్బారావు అంత ఈజీగా మీ జేబులు ఖాళీ చేస్తుంటే చూస్తూ ఊరుకున్నారా?"

"ఏం చెయ్యమంటారు సార్ ? అతనేం దొంగతనంగానీ, మోసంగానీ చెయ్యటం లేదుగా... ఏమైనా అంటానికి? పందెం కాసి గెలుస్తున్నాడు. మా డబ్బులు లాక్కుంటున్నాడు."

"ఐసీ!" మళ్ళీ మరోసారి సాలోచనగా తల పంకించుతూ బట్టతల నోమారు నిమురుకున్నాడు సదాశివరావు.

"సుబ్బారావ్ అలాంటి వాడని తెలిసీ, మీరతనితో బెట్స్ ఎందుక్కాస్తున్నారు ? మానుకుంటే సరిపోతుందిగా ?" అన్నాడు.

లోకనాథం చిన్నగా నవ్వేడు —

"అదే సార్ చిక్కు! సుబ్బారావులో ఓ గొప్ప టెక్నిక్కుంది. మాట్లాడుతూ మాట్లాడుతూనే ఎదుటివాణ్ణి మంచి మూడ్‌లోకి లాగి పారేస్తాడు. అలా మనం మూడ్‌లో వున్నప్పుడే అతను మనతో బెట్ చేస్తాడు."

"అదేవయ్యా! ఆ బెట్ చేసేముందు మీరు కొంచెం మీ ఒరిజినల్ మెదళ్ళతో ఆలోచించొచ్చుగా!... మీరా బెట్‌లో నెగ్గేదీ లేనిదీనూ..."

"అ౦ మనకి తెలీదుగా... సార్!"

"నాన్సెన్స్! తెలీకుండా ఎలా పోతుందీ ? అసలు నీకంతగా నమ్మకంలేని విషయాలమీద బెట్ చేయటమెందుకూ ?"

"సుబ్బారావు టాలెంట్ అంతా అక్కడే వుంది సార్! నిజానికి అతనితో బెట్ చేయబోయే ప్రతివారూ... అందురో తామే గెలుస్తామన్న భ్రమతో పందెం కాస్తారు. అసలు సుబ్బారావు ఎదుటి మనిషినలా రెయిజ్ చేస్తాడు. చివరికి పందెం ఓడిపోయి జేబులు ఖాళీ చేసుకున్న తర్వాత గానీ... తెలివొచ్చి బిక్కమొఖాలేసుకుంటారు."

"ఊఁ బెట్ చేయటంలో సుబ్బారావు అంత మొనగాడన్న మాట! సరే! అలాంటప్పుడిక నన్నేం చేయమంటావ్? మీరు మీ బుద్ధిపూర్వకంగా పందెం కాసి ఓడిపోతుంటే... ఇంక నేను చేసేదేముందీ ?"

సదాశివరావు అలా అనగానే లోకనాథానికి చాలా నిరుత్సాహం కల్గింది. అతను సుబ్బారావ్ మీద చాలా కసితో వున్నాడు బాస్‌తో చెప్పి ఎలాగైనా సరే — అతని పని పట్టించాలనే తాపత్రయంతోనే ఈరోజు అతను సదాశివరావు ముందు ఈ విషయాన్ని ఎత్తేడు.

"లేదు సార్! మీరు తప్పక అతనిమీద చర్య తీసుకోవాలి. లేకపోతే లాభంలేదు. రాను రాను... అతని ఈ విపరీత మనస్తత్వంవల్ల ఆఫీసులో అందరికీ ఇబ్బంది కల్గుతోంది. అతనితో బెట్ చేయటం మాకూ సరదాగానే వున్నా...ఒక్కోసారది పీకలమీదికొస్తూంది.

ఒకసారి పందెం గెలిచాక, అతను డబ్బు విషయంలో చాలా కర్కోటకుడు సార్. కక్కించి గానీ ఒదలడు — నెలాఖరు రోజుల్లో చచ్చి చెడి ఎక్కడన్నా అప్పు తెచ్చుకున్నా... అవి మాకు దక్కుతాయన్న నమ్మకం లేకుండాపోతోంది."

హెడ్‌గుమాస్తా ప్రాధేయపూర్వకంగా చెబుతోంది వింటూ జేబులోంచి సిగరెట్ కేస్ బయటకు తీసాడు సదాశివరావు.

ఒక సిగరెట్ సుతారంగా పెదాల మధ్య ఇరికించుకొని అగ్గిపుల్ల గీసి వెలిగించుకున్నాడు.

"అయితే... ఆ క్లర్కు సుబ్బారావు మీ అందరికీ ఓ సమస్య అయ్యాడన్నమాట." అన్నాడు రింగులుగా సిగరెట్ పొగని సీలింగ్‌కేసి వొదులుస్తూ.

"అవును సార్! మీరెలాగైనా అతని ఈ విపరీతపు అలవాటుని మాన్పించాలి."

"ఐసీ!" తల పంకించారాయన — "ఓ. కే! ఆ హీరోగారి పని నేను పడతాలే! మళ్ళీ ఎప్పుడూ మీతో ఎట్లాంటి పందేనికి దిగకుండా చేస్తాను, నువ్వింక వెళ్ళు —" సిగరెట్ ఆష్‌ట్రేలో పడేసి కాగితాల్లోకి చూపులు మరలుస్తూ, ఆ సంభాషణకి అంతటితో ఫుల్‌స్టాప్ పెట్టేడు సదాశివరావు.

* * *

"యస్ సార్! ఇటీజ్ ట్రూ ... వాట్ ఐ యామ్ సేయింగ్! కావాలంటే పందెం కాస్తాను" సుబ్బారావు మరోసారి ఎంఫసైజ్ చేస్తూ అన్నాడు.

"వాట్ నాన్సెన్స్ యూవార్ టాకింగ్ ? నేనీ రోజు అండర్‌వియర్ తొడుక్కురాలేదనా ... నువ్వనేది ?" కోపంగా అరిచాడు సదాశివరావు, ముక్కుపుటాలు అదిరిపోతుండగా.

'యస్ సర్!" చాలా సిన్సియర్‌గా సమాధానం చెప్పేడు సదాశివరావుకి ఎదురుగ్గా నిలబడి వున్న సుబ్బారావు "అఫ్‌కోర్స్! మీరది కావాలని తొడుక్కోవటం మానెయ్యక పోవచ్చు. కేవలం మర్చిపోయారంటున్నాను — అంతే! ఆఫీసు హడావిడివల్లో ... మరెందువల్లో."

"సుబ్బారావ్!" గద్దించాడు సదాశివరావ్ కోపంతో పిడికిలి బిగించి బల్లమీద గుద్దుతూ.

"ఫూలిష్‌గా మాట్లాడకు. నేనీ రోజు అండర్‌వియర్ తొడుక్కుందీ...లేనిదీ నాకు బాగా తెలుసు. ఆఫీసులో అందరి వద్దా చేసినట్లుగా నా దగ్గిరా లాజిక్‌లు వేద్దామనుకుంటున్నావేమో! అలాంటి పప్పులు మనదగ్గిర ఉడకవ్ జాగ్రత్త!"

"కావచ్చు సార్! కాని చెప్పండి ? ఈ పందేనికి మీరు సిద్ధమా ? కాదా ?"

ఒక్క క్షణం ఆలోచించేడు సదాశివరావు. ఆ తర్వాత అన్నాడు —

"ఓయస్ ... సుబ్బారావ్! ఈ బెట్‌కి నేను [illegible]"

"అయితే పందెం ఎంతనో చెప్పండి ?"

"నువ్వే చెప్పు ! నేనంతకైనా సిద్ధమే."

"నా వంతు పందెం ఏభై రూపాయలు సార్ ! మీరు గనుక గెలిస్తే ఈ డబ్బు తీసుకొండి." జేబులోంచి ఐదు పది రూపాయల నోట్లు తీసి టేబుల్ మీద పెడుతూ అన్నాడు సుబ్బారావు.

సదాశివరావు కొంచెం డైలమాలో పడిపోతూ చూశాడు — నోట్ల వంకా ... సుబ్బారావ్ వంకా. కాస్సేపు మవునంగా అలాగే వుండిపోయాడు, తన్ను తాను మరోమారు రియలైజ్ చేసుకుంటూ.

సుబ్బారావ్ ధోరణి ఆయనకి చాలా సిల్లీగా తోస్తోంది. పిచ్చిగానీ, తను పాంటు లోపల అండర్ వియర్ తొడుక్కుందీ లేనిదీ . అతని కేం తెలుసు ? తనకి బాగా తెలుసు తను తొడిగేడు ! కాని... ??

ఇంత సింపుల్‌గా ఓడిపోతాడా సుబ్బారావు ? ఆఫీసులో అంతమందిలో సంచలనం సృష్టించిన వాడు !

"ఏమిటి ఆలోచిస్తున్నారు సార్ ? బెట్ ఉపసంహరించు కొంటారా ... చెప్పండి ? నాకేం అభ్యంతరం లేదు. ఇందులో బలవంతం కూడా ఏమీ లేదు." సుబ్బారావు నవ్వుతూ రెచ్చగొట్టినట్లుగా అనటంతో తల విదిలించి ఆలోచనల్ని పారద్రోలాడు సదాశివరావు.

"నో నో సుబ్బారావ్ ! ఐ యామ్ రెడీ !"

"ఒక్క షరతు సార్ !"

"ఏమిటది ?"

"ఈ బెట్ ఫలితం యెలా వున్నా . మీరు మాత్రం స్పోర్టివ్‌గా తీసుకోవాలి" సదాశివరావు తల పంకించాడు.

"సరే ! మిస్టర్ సుబ్బారావ్..."

"అయితే మీరు కొద్దిగా లేచి నిలబడి మీ పాంటు లోపల అండర్‌వియర్ చూపించండి. మరేం ఫరవాలేదు సార్... పాంటు పూర్తిగా విప్పక్కర్లేదు — కొద్దిగా బటన్స్ విప్పండి చాలు, నేను ఒప్పుకుంటాను" సుబ్బారావు సజెస్ట్ చేశాడు.

సదాశివరావు తల పైకెత్తి ఓ మారు చుట్టూ చూసేడు అది తన పర్సనల్ రూమ్. ఎవరూ రారు పర్మిషన్ లేకుండా. ఎవరూ చూసే అవకాశం కూడా లేదు.

అతను తల తిప్పి, సుబ్బారావుకేసి సూటిగా చూశాడు. అతని మొహంలో ఏ భావమూ లేదు. కళ్ళల్లో ఎట్లాంటి హేళనతోకూడిన భావం లేదు.

సదాశివరావు లేచి నిల్చున్నాడు. చటుక్కున పాంటు కొద్దిగా విప్పి లోపల అండర్‌వియర్ సుబ్బారావ్‌కి కనబడేలా చూపి... కనబడేలా చూపి మళ్లీ వెంటనే బటన్స్ పెట్టేసుకున్నాడు.

"హావ్ యూ సీన్ మిస్టర్ సుబ్బారావ్ ?"

"యస్ సర్ !" అన్నాడతడు సిన్సియర్‌గా.

"దెన్ వాడ్డూయూ సే నౌ ?". నవ్వుతూ చూశాడు సదాశివరావు.

సుబ్బారావు మొహాన్ని గంభీరంగా పెట్టాడు. సుదీర్ఘంగా నిట్టూర్పు వదులుతూ — "ఓకే సార్ ! బెట్ మీరే గెలిచారు. నేను అగ్రీ అవుతున్నా. ఇదిగోండి ! ఈ ఏభై రూపాయలూ తీసుకొండి"

# పందెం

డబ్బును చేత్తో ముందుకుతోస్తూ... లేచి నిలబడేడు సుబ్బారావు.

సదాశివరావు హాపీగా మందహాసం చిలికించేరు. సిగరెట్ ఒకటి తీసి, వెలిగించి పొగ విలాసంగా వొదిలేరు. ఆ తర్వాత ఓ క్షణం సుబ్బారావ్ మొహంలోకి చూసి, తిరిగ్గా చైర్లో వెనక్కి వాలేరు.

ఆయనకి మహదానందంగా వుంది — అంత ఈజీగా సుబ్బారావుని ఓడించినందుకి.

వెనుదిరిగి పోబోయాడు సుబ్బారావు.

"చూడు సుబ్బారావ్ .." అంటూ వెనక్కి పిలిచారాయన.

"నీ పేరు చెప్పితే చాలు... మన ఆఫీసులో అందరూ భయపడుతున్నారు. ముందు నేనుకూడా బాగానే ఎక్స్‌పెక్ట్ చేశాను సుమా నీ గురించి కాని... ప్చ్... లాభంలేదోయ్ ! చాలా తేలిగ్గా ఓడిపోయావ్. ఇకముందెప్పుడూ ఎవర్తోనూ యిలా బెట్ చేయకు. ముఖ్యంగా మన ఆఫీసులో. ఇంద... ఈ యాభయి రూపాయలూ తీసుకో."

తల వంచుకొని వింటున్నవాడల్లా సుబ్బారావ్ ఇటు తిరిగి ఆశ్చర్యంగా చూశాడు —

"ఏభై రూపాయలా ? ఎందుకు సార్ ?" అన్నాడు.

సిగరెట్ నుసి సుతారంగా ఆష్‌ట్రేలో రాలుస్తూ అన్నాడు సదాశివరావు — "నీ డబ్బు నాకేం అక్కర్లేదోయ్ ! నేనీ డబ్బు కోసం నీతో పందెం కాయలేదు. నీ పోరు భరించలేక పోతున్నామంటూ, నీ మీద ఏదైనా చర్య తీసుకోవాలంటూ వచ్చిన కాంప్లయింట్‌ని బట్టి ... అఫీషియల్‌గా చర్య తీసుకోలేను కాబట్టి నిన్నీ విధంగా పట్టి చూశాను. అంతేకాని నీ డబ్బు కోసం కాదు. ఇది తీసికొని వెళ్లిపో."

సుబ్బారావు మౌనంగా డబ్బు తీసుకొని జేబులో పెట్టుకున్నాడు. "థాంక్యూ సార్ !" అన్నాడు మెల్లగా వినబడీ వినబడనట్లుగా.

"దెన్ యుకెన్ గో !"

తలుపు తెర్చుకొని బయటకి వెళ్లిపోయాడు సుబ్బారావ్.

* * *

మరో పావుగంట తర్వాత —

తలుపు బయట్నుంచి — "మే ఐ కమిన్ సార్?" అన్న కంఠం వినబడితే తలయెత్తి చూస్తూ — "యస్ కమిన్ !" అన్నాడు సదాశివరావు.

హెడ్ గుమాస్తా లోకనాథం తలుపులు త్రోసుకొని చాలా హడావిడిగా మేనేజరు ఎదుటి కొచ్చాడు.

"వాడ్డూయూ వాంట్ ?" గంభీరంగా ప్రశ్నించాడు సదాశివరావు.

"సర్ ! మీరు ... మీరు " మాట పూర్తి చేయలేక ఆగిపోయాడు లోకనాథం. తటపటాయిస్తూ నేల చూపులు చూశాడు.

సదాశివరావుకి అర్థం కాలేదు.

"లోకనాథం ? ఏం కావాలంటే చెప్పవేం?" మరోసారి రెట్టించేడు.

లోకనాథం తేరుకుంటూ చిన్నగా అన్నాడు — "సర్ ! మీరిందాక సుబ్బారావు ముందు మీ పాంటు విప్పారా ?"

సదాశివరావు ఉలిక్కిపడ్డాడు. కుర్చీలో నిటారుగా అయ్యేడు. "ఎవరు చెప్పారు నీకు ? సుబ్బారావు చెప్పాడా ?" ప్రశ్నించాడు తీక్షణంగా చూస్తూ.

"యస్ సార్ ! అతనే చెప్పాడు."

"డామిట్ ! నాతో బెట్ చేసి ఓడిపోయానని చెప్పకోకుండా ఇలా చెప్పుకుంటున్నాడా ?" బాగా ఆవేశం వచ్చింది సదాశివరావుకి.

"ఆఫీసులో మిమ్మల్ని అందర్నీ చేసినట్లుగా నన్నూ ఫూల్‌ని చేసి డబ్బు లాగుదామనుకొన్నాడు. నాతో పందెం కాశాడు. అది కూడా నేనీ రోజు అండర్ వియర్ తొడుక్కురాలేదని. మర్చిపోయానుట — పాంటు విప్పి చూపించి నోరు మూయించేను. మళ్లీ ఎప్పుడూ ఇట్లాంటి బెట్స్ ఎవ్వరితోనూ చెయ్యొద్దని చీవాట్లు వేసి పంపించేను" గర్వంగా అన్నాడు.

విని దిగాలుగా మొహం వ్రేలాడేసాడు లోకనాథం. మొహాన అలుముకున్న చెమటల్ని అరచేతుల్తో తుడుచుకుంటూ,

"ప్చ్ ! బాడ్‌లక్ ! ఈ రోజు లేవగానే ఎవరి మొహం చూశానో ?" అని గొణుక్కొన్నాడు. స్వగతంగానే అయినా కొంచెం గట్టిగానే! సదాశివరావు అది విన్నాడు.

లోకనాథంవేపు చూశాడు. అతని మొహంలో మార్పు కనిపెట్టాడు.

"వాట్ హాపెండ్ మిస్టర్ లోకనాథం ? ఈజ్ ఎనీథింగ్ రాంగ్ విత్ యూ ?" అని ప్రశ్నించాడు.

"యస్ సార్ ! నేను చెప్పలేదూ ... ఆ సుబ్బారావ్ నిజంగానే బ్రిలియంట్ సార్. నా కొంప నిలువునా ముంచాడు."

"ఎందుకు... ? ఏమైంది... ?"

"అతను నాతో పందెం కాసేడు సార్ !"

"ఏ విషయంలో ?"

"ఈరోజ మీచేత మీ పాంటు విప్పించుతానని. నిజంగానే చేసాడని. ఇకనేం... ? నేను ఓడిపోయాను. ఐదూ, పదీ కాదు సార్... రెండొందల రూపాయలు. ఇవ్వకపోతే అతను ఊర్కోడు —"

నీరసంగా అడుగులువేస్తూ వెళ్లిపోయేడు లోకనాథం. వెనక అవాక్కయి, నోరు తెర్చుకొని చూస్తుండిపోయేడు సదాశివరావు.

అంటే, తనతో ఏభై రూపాయలు ఓడిపోయి, బయట లోకనాథంవద్ద రెండొందలు గెలుద్దామను కున్నాడన్నమాట... ముందుగానే సుబ్బారావు. గాడ్... ! ఎంతబాగా యాక్టుచేశాడు ? తనముందు ఓడిపోయినట్లుగా... దిగాలుగా మొహంపెట్టాడు.

తను వెనక్కి తీసుకోమన్న ఏభై రూపాయలూ... ఎంత ఇదిగా వెనక్కి తీసుకొని... జేబులో పెట్టుకున్నాడు ? ? ?

"డర్టీ స్కౌండ్రల్... !" పళ్ళు బిగబట్టి, ముక్కుపుటాలెగురవేస్తూ... కసిగా గొణుక్కున్నాడు మేనేజరు సదాశివరావు.